జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 30-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 232 పేజీలు: 4 వెల: రూ.7

* కాశీబుగ్గ పీఎస్‌లో పాతుకుపోయిన కొందరు పోలీసులు * డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలకు బదిలీ అవుతున్నా కొందరు కానిస్టేబుళ్లు మాత్రం ఇక్కడే * ఒకవేళ బదిలీ అయినా మళ్లీ ఇక్కడకే * ఆ స్టేషన్ ప్రత్యేకత ఏంటో మరి * ఓ కానిస్టేబుల్ పదేళ్లుగా ఇక్కడే మకాం?

# దందాగిరి




**పలాస/శ్రీకాకుళం క్రైం, జనవరి 29 (వార్త):** పలాస కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కో ప్రత్యేకత ఉంది. ఈ స్టేషన్‌లో పనిచేసే డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలకు బదిలీలు అవుతున్నా కొందరు కానిస్టేబుళ్లు మాత్రం ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చుంటున్నారు. ఒక కానిస్టేబుల్ అయితే ఎనిమిదేళ్లు, మరో కానిస్టేబుల్ అయితే పదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారట. బదిలీ అయితే చాలు.. వెంటనే ఉన్నతాధికారులు, రాజకీయ నేతల కాళ్లావేళ్లా పడి మళ్లీ ఇక్కడికే డెప్యుటేషన్, సీ పిన్‌పై మళ్లీ ఇక్కడకే వచ్చేస్తున్నారు. కొందరు పాతుకుపోయిన కానిస్టేబుళ్లయితే.. తమకు ఎక్కడికి బదిలీ అయినా మళ్లీ ఇక్కడికే అంటూ ప్రగల్భాలు పలుకుతూ.. దందాలు చేసుకుంటూ స్టేషన్‌ను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారని తోటి సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. ఇక్కడ నాటుకుపోయిన ఓ కానిస్టేబుల్ అక్రమాలు అధికం కావడం, గత ఎస్పీ దృష్టికి రావడంతో అతగాడికి బదిలీ చేశారు. మళ్లీ మనోడు ఇంకా ఇక్కడే వచ్చేశాడు.. ప్రస్తుతం స్టేషన్‌లో మనోడిదే పెత్తనం. స్టేషన్‌లో అధికారులకు రైట్, లెఫ్ట్ మనోడేనట. దందాగిరి కూడా ఎవరినీ నొప్పించకుండా, అందరినీ కలుపుకొని మేనేజ్ చేస్తాడని తోటి పోలీసులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. అందుకే కొందరు అధికారులు కూడా అతడిని వెనకేసుకువస్తున్నారంట.

## ఆ వీడియోలో ఏముందో?

ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్.. అధికారుల పేరిట కలెక్షన్ చేశాడట. దీన్ని మరో వ్యక్తి వీడియో తీశాడట. ఈవిషయం తెలిసిన కానిస్టేబుల్.. ఉన్నతాధికారికి చేరవేశాడు. ఈ వీడియో బయటపడితే ఎక్కడ తనకు మచ్చ పడుతుందనని వీడియో తీసిన వ్యక్తికి తలంటుపోసినట్టు తెలిసింది. దగ్గరుండి వీడియోను ఫోన్ నుంచి తొలగించినట్టు సమాచారం. అయితే ఆ వీడియో సదరు వ్యక్తి డిలీట్ చేయకముందు మరో వ్యక్తికి పంపించడం, ఈ విషయం బయటపడడంతో కొందరు అధికారులు కోపంతో ఉన్నారట. ఆ వీడియో బయటకు వస్తే కొందరి తలరాతలు మారే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.



# చంద్రబాబు..
# ది గ్రేట్ మోసగాడు

* పథకాలు ఇవ్వలేమని ప్రకటించి నిలువునా మోసం
*అచ్చెన్నాయుడుది డైవర్షన్ పాలిటిక్స్
* ఏడాది కాకముందే కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది
*ప్రజలు వైసీపీ పాలనను గుర్తు చేసుకుంటున్నారు
* వైఎస్సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

**పలాస, జనవరి 29 (వార్త):** ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, ఎన్నికల హామీలతో మాయా చేసిన ది గ్రేట్ మోసగాడు నారా చంద్రబాబు నాయుడు అని, ఎట్టకేలకు తన ముసుగు మొత్తం తీసేశాడని వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా విమర్శించారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌తో కలిసి పలాసలోని డాక్టర్ సీదిరి స్వగృహంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో, ఇవాళ ఆ హామీలను నెరవేర్చలేమని, పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను చంద్రబాబు దగా చేశాడని ధ్వజమెత్తారు. సాక్షాత్తూ సచివాలయంలోనే ఈప్రకటన చేశారన్నారు. చంద్రబాబునాయుడి తన మార్కు దగా మరోసారి రుజువు చేయడానికి ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటే ఆలోచించే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేసిన ప్రకటనతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను డైవర్షన్ చేయడం కోసం జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్ల చౌకబారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి విమర్శలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కోవిడ్ కష్టకాలంలో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని, జగన్మోహన్ రెడ్డి పాలనను ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి నిజం అయ్యాయన్నారు. మాట ఇచ్చి తప్పిన చంద్రబాబును, మాట మీద నిలబడ్డ జగన్మోహన్ రెడ్డిని ఇవాళ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జగన్ విశ్వసనీయతను, ఆయన చిత్తశుద్ధిని, సంకల్పం ఎంత గొప్పవో మరోసారి ఈ సందర్భంగా అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 9 నెలలు కావొస్తోందనీ, ఈ 9 నెలలకాలంలో దాదాపుగా రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారు.. మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారు? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు దగ్గరుండి చూస్తున్నారని, త్వరలో బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టి, పలాస కాశీబుగ్గ పట్టణ వైసిపి అధ్యక్షుడు సిస్టు గోపి, కోటబొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకటరమణ, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపత్ రావు హేమ సుందర్ రాజు, పలాస మండలం మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గం బిసి విభాగం అధ్యక్షుడు పి.వెంకటరమణ, వైసీపీ సీనియర్ నాయకులు బడగల బాలచంద్రుడు పాల్గొన్నారు.

## రోగులకు సేవలందించండి

### సమయపాలన పాటించాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు * కోటబొమ్మాళి సీహెచ్‌సీ తనిఖీ

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జనవరి 29(వార్త):** రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యులను ఆదేశించారు. బుధవారం కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించాలని, వైద్యులకు పలు సూచనలు జారీ చేశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పేదలకు ఉచిత వైద్యం కోసం కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది, టీడీపీ నేతలు ఉన్నారు.



## 95 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

**మందస, జనవరి 29(వార్త):** బుడారిసింగి పంచాయతీ గుడ్డికోల గ్రామం పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్శాఖ, శ్రీకాకుళం జిల్లా ఎన్ఫోర్స్మెంట్ టీం కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. సోంపేట సీఐ కె. బేబి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 1900 లీటర్ల సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 95 లీటర్ల సారాతో ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ బేబి తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఏఈఎస్ డీవీజీ రాజు, సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.



# బాలికల నిష్పత్తి పెంచాలి

**-బాల్య వివాహాలు నిరోధించాలి**

**-బాలికలకు క్రీడలు, విద్యలో ప్రైజ్ మనీ**

**అందజేసిన శాసనసభ్యులు గౌండు శంకర్**

**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** బాలికల లింగ నిష్పత్తి పెంచాలని శాసనసభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. బాలికలను రక్షించండి – బాలికలను చదివించండి చాంపియన్ ప్రోగ్రాంను డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కళావేదికలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమన్నారు. బాల్య వివాహాలు, తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. భ్రూణ హత్యలు అరికట్టాలని, బాలికలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళా సాధికారతను సాధించాలని పిలుపునిచ్చారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతిశ్రీ మాట్లాడుతూ లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా పౌరులకు అవగాహన కల్పించడం, బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతి అందజేస్తున్నామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలపై కొద్దిగా వివక్షత కొనసాగుతోందన్నారు. మహిళలు డిగ్రీ వరకు చదవాలని పిలుపునిచ్చారు. ఎపిసి ఎస్.శశిభూషణ్ మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకుందాం, చదివించుకుందామని పిలుపునిచ్చారు. విద్యార్థులు గొప్ప విజయాలు సాధించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య బేటి బచావో – బేటీ పడావో ప్రైజ్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ప్రదర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన పిల్లల ఊయ



లను శాసన సభ్యులు గొండు శంకర్ ప్రారంభించారు. పిల్లలు దత్తత పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆడ బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు గర్ల్ చైల్డ్ ఇన్సెంటివ్స్ కిట్స్ ను 50 మందికి అందజేశారు. క్రీడలలో గెలుపొందిన పది మందికి రూ.2500లు, మెమెంటో అందజేశారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.2500లు, మెమెంటో అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురికి, కెజిబివి 10 మంది విద్యార్థులకు రూ.2500లు, మెమెంటో అందజేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకటరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, సభ్యులు ఎం.గన్నప్పడు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

# మిల్లర్ల మాయజాలంతో రైతులకు అన్యాయం

**-మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు**

**మందస, జనవరి 29(వార్త):** రైస్ మిల్లర్ల మాయ జాలంతో రైతులకు అన్యాయం జరుగుతోందని మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వం రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సంఘం తరపున కలెక్టర్, జాయింటు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. రైతులుకు ఎంతో మేలు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వ పెద్దలు.. రైతులు కష్టపడి పంటలు పండిస్తే అందరూ దర్జాగా కడుపు నిండా కూడు తింటున్నారని, రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే తల ప్రాణము తోకకు వచ్చినంత పని అవుతోందన్నారు. మందస మండలంలో మిల్లర్ల మాయాజాలానికి అధికారులు సహకారము అందిస్తున్నారన్న అపకీర్తి మాత్రము మూట గట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కళ్ళం గట్టులో ధాన్యము ఆర్బీకె ద్వారా ఇచ్చేస్తే చాలు మీకు పూచి లేదని అధికారులు చెప్పుతున్నారని, కానీ మిల్లర్లు రైతులు వద్ద ఇష్టం వచ్చినంత దోచుకుంటున్నారన్నారు. అన్ లోడింగు పేరుతో బస్తా(82కిలోలు)కు గాను రూ.20లు, ట్రాక్టర్ మాములు పేరుతో రూ.150లు ఒక ట్రాక్టర్ లోడుకు (60 బస్తాలకు) రూ.1200లు, మామూలు రూ.150లు, అన్ లోడింగు రూ.20లు కలిపి సుమారు రూ.1370లు వసూలు చేస్తున్నారన్నారు. ఇదెక్కడి అన్యాయమని అడిగితే, ప్రభుత్వం మాకు ఇవ్వడం లేదని.. అందుకే కళాసీలకై తీసుకుంటున్నామని చెబుతున్నారన్నారు. అన్ లోడింగ్ విషయమై సివిల్ సప్లై డీఎంకు అడిగితే మాకు తెలియదని పేర్కొంటున్నారన్నారు. తహసీల్దార్ కు ఫిర్యాదు చేస్తే మాకు తెలియదంటున్నారని, ఏఓ, వ్యవసాయ శాఖకు అడిగితే మాకు సంబంధము లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తంతు అంతా పరిశీలిస్తే, మిల్లర్ల మోసానికి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇదిలా ఉండగా 80% కొను



గోలు జరిగి పోయిందని, మిగిలిన 20% ధాన్యానికి బ్యాగులు లేవని, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస వెళ్ళండని అధికారులు చెపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ యంత్రాంగము కళ్ళు తెరిచేదెప్పుడూ, రైతు కష్టాలు తీరే రోజు ఎప్పుడొస్తుందో అని ఎదురు చూపే మిగులుతోందన్నారు. అన్నం తినే నాయకులు గానీ, అధికారులు గానీ ఉన్నట్లతే మా బాధలు నెరవేర్చండని సవినయముగా కోరుతున్నామన్నారు.

# వన్ స్టాప్‌తో మహిళలపై వేధింపులకు ఫుల్‌స్టాప్

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**

**కార్యదర్శి సన్యాసినాయుడు**

**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** పరువు, పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్లు భరోసానిస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు పేర్కొన్నారు. గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, గౌరవ జిల్లా జడ్జి ఆదేశాల మేరకు రిమ్స్ ఆస్పత్రుల్లో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో



మాట్లాడారు. ఈ కేంద్రాలతో బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించడం తో పాటు న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇస్తూ అండగా నిలవడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. మహిళలు, చిన్నారుల్లో ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే పోలీసుల సహాయంతో కేసు దర్యాప్తు మొదలు బాధితులకు ఆశ్రయం సైతం కల్పించి, వారికి న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇవ్వడం వంటివి పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ సెంటర్లలో 18 ఏళ్ల లోపు వయసున్న బాలికలు, అంత కంటే ఎక్కువ వయసున్న మహిళలకు వారి అవసరాన్ని బట్టి సహకారం అందిస్తారని, ఏమైనా సమస్య వస్తే బాధితులు నేరుగా సెంటర్‌కు వెళ్లొచ్చు.. లేదా అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో ఫిర్యాదు చేయొచ్చు అని సన్యాసినాయుడు తెలిపారు.

# కృత్రిమ గర్భధారణతో ఆడ దూడలు

**-పశుసంవర్ధక శాఖ**

**జాయింట్ డైరెక్టర్ రాజగోపాల్**

**మెళియాపుట్టి, జనవరి 29(వార్త):** లింగ నిర్ధారిత వీర్యము అందుబాటులో ఉందని, దీనిని సెక్స్ సార్టెడ్ సెమెన్ అని అంటారని ఈ వీర్య నాళికలతో పశువులలో కృత్రిమ గర్భధారణ చేపించినట్లయితే 95 శాతం ఆడదూడలే జన్మిస్తాయని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రాజగోపాల్ తెలిపారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో బుధవారం నాడు మెలియాపుట్టి మండలం పెదపద్మాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనే గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాస పెంపకం ఉందని తెలియజేస్తూనే నీటి సౌకర్యం ఉన్నటువంటి పాడి రైతులు బహువార్షిక పశుగ్రాసాన్ని కనిష్టంగా 10 సెంట్లు నుంచి గరిష్టంగా 50 సెంట్లు వరకు పెంచుకోవచ్చన్నారు. 50 సెంట్లు పశుగ్రాసాన్ని సాగు చేసినటువంటి పాడి రైతులకు ఒక సంవత్సర కాలానికి సుమారుగా 33 వేల రూపాయల లబ్ధి చేకూరుతుందన్నారు. పశువుల




ఉచిత గర్భకోసవ్యాధుల శిబిరంలో 61 పశువులకు గర్భకోస సంబంధ వ్యాధులకు చికిత్స చేయడం జరిగిందని స్థానిక ఇన్చార్జ్ పశు వైద్యాధికారి పారిసిల్లి అనిల్ కుమార్ తెలియజేస్తూనే పశు యజమానులకు మినరల్ మిక్సర్ మరియు లివర్ టానిక్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఉపసంచాలకులు వి. జయరాజ్, సహాయ సంచాలకులు మంచు కరుణాకర్, సర్పంచ్ ప్రతినిధి శ్రీధర్, పశు వైద్యాధికారులు అనిల్ కుమార్, రాధాకుమారి, సిబ్బంది గణపతి రావు, సింహాచలం, వీరమ్మ, గణపతరావు, సంపతిరావు, పశుపోషకులు వసంతరావు, గ్రామస్తులు, రైతులు తదితరులున్నారు.



## రాంపురం, బహడపల్లిల్లో పశు వైద్య శిబిరాలు

**మందస, జనవరి 29(వార్త):** మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో రాంపురం, బహడపల్లిల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించి, చికిత్స చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో జుత్తు అమ్మినాయుడు, బొడ్డు ఉమాపతి, దున్న రామారావు, కోడ లక్ష్మణ్, కొమర వాసు, అందాల గిరి, సాలిన జానకిరావు, మట్ట కూర్మారావు తదితర పాడి రైతులతో పాటు సిబ్బంది ధర్మేంద్ర, ధనుంజయరావు, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, ఇంతియాజ్, పురుషోత్తం, ఎంఏవీసీ సిబ్బంది డాక్టర్ దేవి, శ్రావణి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

## కె.నారాయణలో 3న ఉచిత అక్షరాభ్యాసం



**మందస, జనవరి 29(వార్త):** కుంటికోటలో గల కె.నారాయణ స్కూల్లో ఫిబ్రవరి మూడున చిన్నారులకు ఉచిత అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ గుంట రోహిణి తెలిపారు. శ్రీపంచమి (సిరిపంచమి) సందర్భంగా ఆ రోజు ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు ప్రముఖ వేదపండితుల పర్యవేక్షణలో నిర్వహించే ఈ అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులకు పలక, బలపం ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 63059308456, 7093733294 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, జనవరి 29(వార్త):** మందస మండలంలో ఈనెల 31న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.యోగి చెప్పారు. 132కేవీ పలాస సబ్ స్టేషన్ లో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మందస మండలంలో గల గ్రామాలలో విద్యుత్ నిలుపు చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు సూచించారు. సంకల్ప కార్యక్రమం ఆదిత్య కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తతో ఉండాలన్నారు.

## జాన్ వెస్లీ ఎంపికపై దళిత నేతల హర్షం

**వంగర, జనవరి 29(వార్త):** సీపీఎం సీనియర్ నేత, దళిత బహుజనుల హక్కుల గొంతుక జాన్ వెస్లీ తెలంగాణ పార్టీ కార్యదర్శిగా ఎంపికపై దళిత బహుజన నేతలు మజ్జి గణపతి, ఎం.గణపతిరావు, చిత్ర గంగులు, డర్రు రాంబాబు, అప్పలస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివిఎంసి సభ్యుడు, దళిత బహుజన జెఏసి ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి. గణపతి మాట్లాడుతూ దశాబ్దాలు నుంచి జాన్ వెస్లీ బడుగు బలహీన వర్గాల గొంతుకుగా బహుజనుల కోసం అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. కుల వివక్ష నిర్మూలన, భూమి భుక్తి కోసం , దేవాలయాల్లో దళితుల ప్రవేశాల పట్ల అలుపెరగని పోరాటాలు జాన్ వెస్లీ చేశారని గణపతి వివరిస్తూ ఆయనతో 15 ఏళ్లు కలిసి పోరాటాలు చేశామని వివరించారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.గణపతిరావు మాట్లాడుతూ వెస్లీ బలహీన వర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేసి వేగుచుక్కగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన్ బుజ్జి, రాజు, చిన్న రామారావు, సుధీర్, సింహాచలం, నాయకులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కరాటే, తైక్వాండో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 38077 మంది విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష ప్రశిక్షణ్ పథకం క్రింద కరాటే లేదా తైక్వాండో వంటి స్వీయరక్షణ కళల్లో శిక్షణ ఇచ్చుటకు రిజిస్టర్ సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తెలిపారు. అర్హత, టెక్నికల్ క్వాలిఫికేషన్స్, ఎంపిక విధానం, దరఖాస్తుకు సమర్పించాల్సిన సర్టిఫికెట్ వివరాలు ఈ కార్యాలయ వెబ్‌సైట్ deosklorgనందు పొందుపరిచామని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు సదరు వెబ్‌సైటు నుంచి వివరాలు తెలుసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 3వ తేది సాయంత్రం 5 గంటలలోగా ఏ.పి సమగ్ర శిక్షా, శ్రీకాకుళం, కార్యాలయములో నేరుగా అందజేయాలని తెలిపారు. ఫిబ్రవరి 5న ఎంపిక జాబితా విడుదల చేస్తామన్నారు.



## కేజీబీవి విద్యార్థిని మహాలక్ష్మి ప్రతిభ

**మందస, జనవరి 29(వార్త):** జీఆర్ పురం పరిధిలో గల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థిని పైడపల్లి మహాలక్ష్మి ప్రతిభ చూపింది. ఎంఎల్టీ గ్రూపులో ప్రథమ బహుమతిని నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకుంది. శ్రీకాకుళం ఎంఎల్ఏ గొండు శంకర్, ఏపీసీ శశిభూషణ్, డీఈఓ తిరుమల చైతన్య నుంచి అవార్డును ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి, మహాలక్ష్మి అందుకున్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది..మహాలక్ష్మిని అభినందించారు.

## రహదారి నిబంధనలు పాటించాలి




**మందస, జనవరి 29(వార్త):** ప్రతీ ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పక పాటించాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కోరారు. మందసలోని బస్టాండ్‌లో బుధవారం వారు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ర్యాలీలో నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు, కానిస్టేబుల్స్, యువకులు పాల్గొన్నారు.

## మరువాడ, కొనంగిపాడుల్లో పొలం పిలుస్తోంది




**వంగర, జనవరి 29(వార్త):** మరువాడ, కొనంగిపాడు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి టి.కన్నబాబు మాట్లాడుతూ మొక్కజొన్నలో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పవిత్ర, ప్రకృతి వ్యవసాయ ఇన్చార్జి సింహాద్రి నాయుడు తూటికాడ కషాయం తయారీని వివరించారు. పోలినాయుడు, రైతులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్ల వ్యాఖ్యలు సరికావు



**వంగర, జనవరి 29(వార్త):** గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ ఉన్నత పాఠ శాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రధానోపాధ్యాయుల అనుమతితో టీచర్లు సెలవు పెడితే సోకాజు నోటీసులు జారీచేయడాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఏ) తీవ్రంగా ఖండించింది. బుధవారం ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండ్రంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల అనుచిత వ్యాఖ్యలు విచారకరమన్నారు. షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి నాదెండ్ల ఉపాధ్యాయులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**వజ్రపుకొత్తూరు, జనవరి 29(వార్త):** పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య శాఖ ఏడి రవికృష్ణ అన్నారు.గురువారం పెద్ద బోడ్డపాడుగ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ పాడి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశం పెట్టడం జరిగిందని, పాడి పశువుల వలన నిత్యం ఆదాయం ఉంటుందని, గత కన్నా ప్రతి గ్రామంలో పశు సంపద పెరిగిందని, దీనివల్ల సామాన్య రైతు కూడా ఆదాయము వస్తుందని, రైతు సోదరులు పశువుల వ్యాధులకు కావలసిన వైద్యం అందించే నిమిత్తం ఈ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసిందని ఈ అవకాశాన్ని రైతు సోదరులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, గ్రామ పెద్దలు, రైతులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**- శాసనసభ్యులు గొండు శంకర్**




**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని, యువతే దేశా దిశ నిర్దేశమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో చిలకపాలెం శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో యువతని భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. యువతను చైతన్యం చేసే దిశగా వ్యాసరచన, వృత్తృత్వ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత అభివృద్ధితోనే దేశం అభివృద్ధి అభివృద్ధి చెందుతుందన్నారు. అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద వంటి ప్రముఖుల స్ఫూర్తితో యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ వారసత్వ, సంస్కృతి ఆచారాలు, సంప్రదాయాలను ఉత్తమ అభ్యాసాలు, అనుభవాలను పంచుకోవడంతో జిల్లాల మధ్య అభ్యాసాన్ని ప్రోత్సహించే వాతావరణం సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రెసిడెంట్ వి ఎమ్ ఎమ్ సాయినాథ్ రెడ్డి, దుర్గా ప్రసాద్ రాజు, ప్రిన్సిపాల్ డా. యండ శ్రీనివాసరావు, న్యాయవాది, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టి.సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ డా.జి.టి.చంద్రశేఖర్, కె.మధుకర్, ఎన్.వై.కె గణాంకధికారి కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, కర్నూలు జిల్లా యూత్ లీడర్ నాగేశ్వరరావు, కర్నూలు జిల్లాకు చెందిన యువతీ, యువకులు, ఎన్.వై.కె. వాలంటీర్లు ఆరుగుల దిలీప్ కుమార్, పైడి సాయిరాం, ప్రియాంక, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిలను అభినందించిన ఎస్పీ



**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** 69 వ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురు (విద్యార్థినిలు) క్రీడాకారులను శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి అభినందించారు. జనవరి 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రంలో నాగపూర్ పట్టణంలో 69 వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, జిల్లాకు చెందిన సింగూరు నందిని, ముంత గాయత్రి, బెండి జ్యోత్స్న జట్టు సభ్యులుగా ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం పొంది సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. బుధవారం ముగ్గురు క్రీడాకారులు జిల్లా ఎస్పీ వారిని జిల్లా పోలీస్ కార్యాలయం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరి ప్రతిభను గుర్తించి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేసి క్రీడల్లో మరెన్నో, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి కెవి రమణ, కోచ్ మదు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని విధ్వంసం చేసే థర్మల్ పవర్‌ప్లాంట్ వద్దు

**-ఆదివాసీ గ్రామాలను అంధకారం చేయొద్దు**

**-పతిపాదనను విరమించుకోవాలి**

**- లేకపోతే పోరాటానికి సిద్ధం**

**-ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి హెచ్చరిక**




**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో గల వెన్నెలవలస, లక్ష్మీపురం, శ్రీరామంవలస, మదనాపురం, బొడ్లపాడు, అడ్డూరిపేట, జె.వి పురం, సోమదలవలస, గోపిదేవిపేట ఆదివాసీ గ్రామాల పరిధిలో 3200 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి డిమాండ్ చేశారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం వాబ.యోగి మాట్లాడుతూ విదేశాల్లో నిషేధించబడిన పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల ఎక్కడ ఉన్నటువంటి పర్యావరణంతో పాటుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార, నాగావళి నీటిని వ్యవసాయానికి కాకుండా ఈ పవర్ ప్లాంట్ అవసరాలకు నీరు ఉపయోగించే పరిస్థితి వస్తుందని దీనివల్ల రైతాంగం కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమదాలవలస ప్రజలు చిరకాల కోరిక సుగర్ ఫ్యాక్టరీ ప్రారంభించి, అభివృద్ధికి తోడ్పడాలని, వ్యవసాయం అభివృద్ధి ఇండస్ట్రీస్ తీసుకు రావాలని ప్రభుత్వానేన్ని కోరారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంట్ వలన అక్కడ ప్రజల మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని, తక్షణమే దీనిని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గురాడి అప్పన్న, జేఏసీ కార్యదర్శి బిడ్డకు ఉమామహేశ్వరరావు, సవర శోభన్,సవర సింహాచలం,సురేష్ దొర, గణేష్,వెంకటేష్, మాజీ సర్పంచులు ఆదినారాయణ, కిరణ్‌కుమార్, సూర్యనారాయణ, రమణ, రవికాంత్, పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రకృతి వనరులను పరిరక్షించండి

**-జనసేన నాయకుల విన్నపం**



**పలాస, జనవరి 29(వార్త):** గత హయాంలో ప్రభుత్వ ఆస్తుల పై అనేక ఆక్రమణలు జరిగాయని సాక్షాత్తు ఎమ్మెల్యే గౌతు శిరీషా స్వయంగా భూ అక్రమాలు, ప్రభుత్వ ఆస్తులను కొంతమంది ఆక్రమణదారుల దుర్వినియోగంపై తన ఆందోళనను కొన్నాళ్ల కృతం వ్యక్తం చేశారు అని అధుకారులకి గుర్తు చేస్తు ఆర్డివో, తాసిల్దార్ సీసీని కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ ,పరివర్ణ , చెరువులు కొండలు పరిరక్షణ, ఇప్పటికే ఆక్రమణకు గురయ్యాయిన వాటినీ స్వాధీనపర్చడం పై కార్యచరణ వంటి విషయాలు పై పలాస జనసేన నాయకులు రెవెన్యూ అధికారులతో చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆక్రమణలు తగ్గుముఖం పట్టాయి కానీ గత పాలనలో జరిగిన ఆక్రమణలను అధికారులు వట్టించుకోకపోవడం ఇప్పుడు సాగటు ప్రజానీకానికి ఆందోళన కలిగిస్తోంది అని, ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో సంబంధిత అధికారులతో కొన్ని సార్లు చర్చించి తాగు చర్యలు తీసుకోవాలిని, చెప్పిన నప్పటికి అక్రమాలను స్వాదినపర్చే కార్యరూపం అధికారులు దాల్చలేదుని, పలాస అభివృద్ధి కొరకు కుటమి ప్రభుత్వం ఇస్తున సహకారం కొత్త అభివృద్ధి సంస్థలు పెట్టాలి అంటే స్థల కేటాయింపు సమస్యలు తల్లెత్తైయే పరిస్థితి రాకుండా ప్రభుత్వ ఆస్తులు పరిరక్షణ అవసరంని, మందస మండల పరిసరలలో కొన్ని గుర్తించిన స్థలాల్లో రాత్రి వేళల్లో కొందరు అక్రమ కంకర తవ్వకాలు జరుగుతున్నాయని, పర్యావరణ పరిరక్షణకు కంకర తవ్వకాలు పై కుడా రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని జనసేన పార్టీ నాయకులు హరీష్ కుమార్ శ్రీకాంత్, కృష్ణారావు ఆర్డిఓ సీసీ కి కలిసి కోరారు.

## జగన్ చేతకానితనంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం



**పలాస, జనవరి 29(వార్త):** జగన్ రెడ్డి అసమర్థ పాలనతో 10 లక్షల కోట్ల అప్పుల భారంలోకి ఆంధ్రప్రదేశ్‌ను నెట్టేసారుని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రస్తుతం ఏడాదికి 71 వేలకోట్లు అసలు వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గత 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం కొనుగోలు, ఫీజ్ రీయింబర్స్మెంట్ లాంటి బకాయిలను 22వేల కోట్లు తెలుగుదేశం ప్రభుత్వం చెల్లించిందన్నారు.జగన్ పాలనలో విద్య, వైద్య, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, ఉపాధి హామీతో పాటు పిల్లలకు సరఫరా చేసే చిక్కీలు, గుడ్లు సరఫరాలో కూడా పెట్టిన బకాయిలు మొత్తం 1.40 లక్షల కొట్లుగా ఉందన్నారు. జగన్ విలాసాలకు, జల్సాలకు 19,871.35 కోట్లు ఖర్చు చేసారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధికి గత అప్పులు గుదిబండలా మారాయని వాపోయారు.

# గత ప్రభుత్వ బకాయిలు రూ.22వేల కోట్లను చెల్లించాం



**శ్రీకాకుళం, జనవరి 29(వార్త):** గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్ మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు . గురువారం శ్రీకాకుళం నగరం విశాఖ ఏ కొలని తన క్యాంపు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేసారు . ఆంధ్ర రాష్ట్రానికి అప్పులు కూడ పుట్టని స్థితి ఏర్పడిందన్నారు . ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని , ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారిందన్నారు . డిగ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు 2,832 , ఫీజు రీయంబర్స్ మెంట్ రూ. 450 కోట్లు , చిక్కిలు, కోడిగుడ్లు రూ.256 కోట్లు , వసతి దీవెన రూ. 989 కోట్లు, ఆరోగ్య శ్రీ బకాయిలు రూ.1800 కోట్లు, ధాన్యం బకాయిలు రూ. 1600 కోట్లు, ఉద్యోగులకు బకాయిలు . 20,000 కోట్లు , ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు . 19,000 కోట్లు , గృహ నిర్మాణం బకాయిలు 7,800 కోట్లు , ఉపాధి హామీ బకాయిలు 2,100 కోట్లు ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ.1.40 లక్షల కోట్లు ఉన్నన్నారు . . ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదని పేర్కొన్నారు . తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారని మండిపడ్డారు . అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని , భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్కు అనుమతులు.. ప్రతీ దాంట్లో ఆశ్రిత పక్షపాణానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారన్నారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టిన మహా ఘనుడు జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు . టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, చివరకు రేషన్ బియ్యంలో కూడా చేతివాటం చూపారని , చివరికి చిన్నారుల పోషుడు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంది వాటిల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడన్నారు.





**టెక్కలి, జనవరి 29(వార్త):** టెక్కలి డిపో గ్యారేజీ ఆవరణలో బుధవారం నిర్వహించిన జాతీయ భద్రత మాసోత్సవాల్లో ఎంవీఐ ఎం.సంజీవరావు మాట్లాడుతూ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిమీద ఉందన్నారు. టెక్కలి సీఐ విజయకుమార్ మాట్లాడుతూ ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బస్సుని నడిపి క్షేమంగా గమ్యం చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాపౌట్‌లపై దృష్టి సారించండి



**ఇచ్ఛాపురం, జనవరి 29(వార్త):** ఇచ్ఛాపురం మండలంలో పరిధిలోని విద్యాశాఖ కార్యాలయం లో బుధవారం సమగ్ర శిక్ష ఏ ఎల్ ఎస్ కోఆర్డినేట్ పి జనార్దన్ రావు సిఆర్పి లకు సమగ్ర శిక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత జరుగుతున్న డ్రాపు అవుట్ సర్వేలను సరైన కారణాలతో పొందుపరిచాలని తెలిపారు.ఎన్రోల్మెంట్పై దృష్టి పెట్టాలని తెలిపారు .ఎంఈఓ అప్పారావు, సిఆర్పి లు, ఈ ఎం ఐ ఎస్ కోఆర్డినేట్ రవి, సిబ్బంది కామేష్ , రాంబాబు పాల్గొన్నారు.

### బడికి పంపండి

**ఇచ్ఛాపురం, జనవరి 29(వార్త):** ఈదుపురం కంద్ర వార్డు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన డ్రాపౌట్ విద్యార్థులను రెగ్యులర్ గా పాఠశాలకు పంపాలని ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు హెచ్ ఎం బి. రామరావు కౌన్సిలింగ్ చేశారు. గ్రామంలో విద్యార్థుల ఇంటింటికి సిబ్బందితో కలిసి వెళ్లి ఆ విద్యార్థులు పాఠశాలకు రాకపోవడం పై ఆరా తీశారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను బడికి మాత్రమే పంపాలని వారిని ఎటువంటి పనులకు పంపకూడదని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్‌రావు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూడండి : శ్రీకాంత్



**పలాస, జనవరి 29(వార్త):** సంక్షేమం పేరుతో అప్పులు చేసే విధానాన్ని విద్యావంతులు, మేధావులు వ్యతిరేకించాల్సింది పోయి, పార్టీల మీద అభిమానం తో తప్పుడు ప్రచారాలకు మద్దతు తెలపడం భవిష్యత్‌కి అంత మంచిది కాదని సీనియర్ కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్ర బాబు సంక్షేమ పథకాలను ఇవ్వనవలేదని, డబ్బులును డైవర్ట్ చెయ్యలేనన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం చంద్రబాబుకు అందరూ సహకరించాలని కోరారు.

## మౌలిక వసతులు మెరుగుపర్చండి



**ఇచ్ఛాపురం, జనవరి 29(వార్త):** పట్టణానికి సమీపంలో పాతలేశ్వర స్వామి ఆలయం సమీపంలో సుమారు 700 ఇళ్ళు నిర్మాణం వివిధ దశలలో ఉన్నాయని వాటిలో మౌలిక వసతులు మెరుగు పర్చాలని సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. కరెంటు మీటర్ కనెక్షన్ కు గత ప్రభుత్వంలో ఉచితంగా ఇచ్చేవారని, ఇప్పుడు 1900 నుండి 3000 వరకు తీసుకుంటున్నారని అన్నారు. గతంలో ఉచితంగా అమర్చిన మీటర్లకు కూడా ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. కాలనీ వాసులకు నీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, కాలనీ మధ్యలో రోడ్లు పనులు అస్సలే ప్రారంభమవలేదని, ముఖ్యమైన రైల్ ట్రాక్ క్రింది ఇరుకు మార్గం వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.బహుదా నదికి వరదలు వస్తే కాలనీకు ఇచ్ఛాపురం పట్టణానికి రాలేపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని, సంబంధిత అధికారులు పైన పేర్కొన్న కాలనీ వాసుల అవసరాలకు తగు చర్యలు తీసుకుంటారని కోరారు.

# అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌కు ఎనిమిది వినతులు



**పలాస, జనవరి 29(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్ కు 8 వినతులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు . రామకృష్ణ పురం లే అవుట్ మరియు టిడ్కో ఇండ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయని, ముఖ్యంగా అర్బన్ లే అవుట్ లలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, ఇసుక వంటి సమస్యల పై దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. మొత్తం 8 దరఖాస్తులు రాగా, వివిధ శాఖాధికారులతో మాట్లాడి పరిష్కారం చేసినట్లు తెలిపారు. టిడ్కో ఇండ్లకు సంబందించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావలసి ఉందని, అందుకు ఇండ్ల కొరకై సొమ్మును డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కి సంబంధించి స్వంత స్థలాలలో మరియు లే అవుట్ల లో ఇండ్ల నిర్మాణములు చేసిన వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయం లో సంప్రదించాలని తెలియజేశారు.

# రబీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**ఇచ్ఛాపురం, జనవరి 29(వార్త):** మండలం కేసుపురం, కీర్తి పురం మరియు కొలిగాం గ్రామం నందు ఏర్పాటుచేసిన పొలంపిలుస్తుంది కార్యక్రమం లో రైతులకు రబి పంట లో వేసే నువ్వులు, మిను ములు యాజమాన్య పద్ధతులు మీద వివరించారు. పూత దశ వచ్చినపుడు 19:19:19 న్యూట్రినెంట్ స్ప్రే చేస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని ఉద్యాన అధికారి మాధవి లత కేసుపురంలో రైతులను ఉద్దేశించి చెప్పారు. ఉద్యాన శాఖకు సంబంధించి వివిధ పథకాల గురించి వివరించడం జరిగింది. అలాగే కొబ్బరి కి సంబంధించి బీమా ను వివరించడం జరిగింది. కొబ్బరి భీమా కి సంబంధించి రైతులు తమ యొక్క తోటలో ఉన్నటువంటి నాలుగు నుంచి 15 సంవత్సరాలు మరియు 16 నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న ఆరోగ్యకరమైనటువంటి కొబ్బరి చెట్లకు ఒకటి లేదా రెండు లేదా మూడు సంవత్సరమునకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని వివరించడం జరిగింది. రైతుల నుంచి కావలసిన డాక్యుమెంట్లు పత్రాలు డిడి వంటి వివరాలు ఒక్కొక్క చెట్టుకు వయసును బట్టి చెల్లించవలసిన ప్రీమియం మరియు ఇన్సూరెన్స్ వివరాలు వివరించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి భార్గవి పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 13న ఢిల్లీలో

# అంగన్‌వాడీల ధర్నా

**వంగర, జనవరి 29(వార్త):** ఢిల్లీలో ఫిబ్రవరి 13 న జరగనున్న అంగన్వాడీ వర్కర్ల సమ్మె జరప నున్నట్లు అంగన్వాడీ వర్కర్లు మండల లీడర్లు పి.భారతి, యస్.కుమారి తెలిపారు. ఈ ధర్నా అనంతరం తాము రాష్ట్ర పతి ద్రౌపదీ ముర్మును కలసి తమకు ఉద్యోగ క్రమ బద్ధికరణ చెయ్యాలని,7 వ పే కమిషన్ సిఫార్సు కనుగుణంగా కనీస వేతనం రూ.26000 లకు పెంచే టట్లుప్రభుత్వం చర్యలు తీసుకోనే టట్లు మెమొరండాన్నిఅంద జేయనున్నట్లు బుధవారం నాడు వంగర మండలంలోని మెట్ట మగ్గూరు అంగన్వాడీ సెంటర్లో జరిపినఅంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో పేర్కొన్నారు.అంగన్వాడీలకు గుజరాత్ హైకోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలు,హెల్పర్లకు రెగ్యులై రేషన్ బకాయిలు,వడ్డీతో సహా చెల్లించాలని తదితర అంశాల పై రాష్ట్రపతికి మెమొరాండంలో పేర్కొని అందజేయనున్నట్లు ఈ సమావేశంలో పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఉన్నారు.



# సీపీఓ రామారావు ఔదార్యం



**మందస, జనవరి 29(వార్త):** అనకాపల్లి కలెక్టరేట్ లో ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీఓ)గా పనిచేస్తున్న గేదెల రామారావు ఔదార్యం చూపారు. ఆయన తండ్రి స్వర్గీయ గేదెల అప్పన్న స్మారకార్థం బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులకు ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే పదవ తరగతిలో మంచి మార్కులతో ప్రతిభ కనబరచాలని ఆశిస్తూ స్టడీ మెటీరియల్ అందజేసినట్టు ప్రధానోపాధ్యాయుడు అంబటి కృష్ణమూర్తి తెలిపారు. స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహోపాధ్యా యుడు ఇ.శ్రీను, ఆర్.వెంకటరమణ, టి.దీనబందు, కుత్తుం ప్రకాశరావు, శంకరరావు, వసంతరావు, సాంబమూర్తి, దీప్తి, రెహానా తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546